క్లుప్తంగా

హాస్టల్‌లో ఆట వస్తువులు అందజేత



బాలురకు ఆట వస్తువులను అందజేస్తున్న కొమ్మిని ఫౌండేషన్ ప్రతినిధులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు శనివారపు పేట ప్రభుత్వ వసతి గృహంలోని బాలురకు కొమ్మిని ఫౌండేషన్ అధ్యక్షుడే కొమ్మిని అనిల్ ఆధ్వర్యంలో వాలిబాల్స్, ఫుట్‌బాల్, క్రికెట్ కిట్లు, పౌష్టికహారం, మామిడి పండ్లను శనివారం అందజేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న స్టేట్ ఫారెస్ట్ మాజీ డైరెక్టర్ పల్లెం ప్రసాద్ మాట్లాడుతూ హాస్టల్ బాలలకు ఆట వస్తువులు ఇవ్వడం స్ఫూర్తిదాయకమన్నారు. అనిల్ మాట్లాడుతూ బాలలు బాగా చదువుకొని సమాజంలో గొప్పగా ఎదగాలని ఆకాంక్షించారు. పౌష్టికాహారం తీసుకొని ఆటపాటలతో ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కొమ్మిని వర్షిత్ జార్జి, చట్టుమాల జీవన్, యశ్వంత్ రెడ్డి, జస్వంత్ గౌడ్, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా మార్గం వైపు పరుగులు తీయాలి



కొప్పులవారి గూడెంలో పర్యటిస్తున్న హరికృష్ణ

ఏలూరు (టూటౌన్): చిన్నారులంతా విద్యా మార్గంవైపు పరుగులు తీయాలని తెలుగు రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలు పెంపు సాధన సమితి జాతీయ కన్వీనర్, రాష్ట్ర చర్మకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పొలిమేర హరికృష్ణ పిలుపునిచ్చారు. పెదవేగి మండలం కొప్పుల వారి గూడెం దళితవాడలో విద్యా ఆవశ్యకత పై గ్రామ బాట కార్యక్రమాన్ని హరికృష్ణ, తదితరులు శనివారం నిర్వహించారు. ఆ వివరాలను స్థానిక గన్‌బజారులోని సంఘ కార్యాలయంలో ఆయన వెల్లడించారు. రాజ్యాంగపరంగా సంక్రమించే విద్య, వైద్య, ఉద్యోగాల్లో రాణించాలంటే ప్రభుత్వం అందించే విద్యా సౌకర్యాలను అందిపుచ్చుకొని దళిత చిన్నారులంతా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు ఉప్పులూరి రామరాజు, ఎర్రా రాంబాబు, దేవదానం తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



మొక్కలు నాటి నీరు పోస్తున్న ఎస్పీ

ఏలూరు టౌన్: ఆరోగ్యవంతమైన సమాజానికి పరిసరాల పరిశుభ్రత పాటించాలనీ, పోలీస్ స్టేషన్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ సూచించారు. స్వచ్ఛ దివస్‌లో భాగంగా ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ప్రాంగణం, పరిసరాలను పరిశుభ్రం చేశారు. అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రాంగణంలోని వ్యర్థాలను, పిచ్చి మొక్కలను తొలగించారు. ఎస్పీ శివకిషోర్ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు పోలీస్ సబ్ డివిజన్ల పరిధిలో పోలీస్ అధికారులు, సిబ్బంది శ్రమదానం చేశారు. ఎస్‌బీ సీఐ మల్లేశ్వరరావు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ఎస్ శేఖర్, ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, ఆర్ఐ పవన్‌కుమార్, పోలీస్ సిబ్బంది శ్రమదానంలో పాల్గొన్నారు. ఎస్పీ శివకిషోర్ మొక్కలు నాటి నీరు పోశారు.

ఏఎంసీ కమిటీల ప్రమాణ స్వీకారం

ఏలూరు (టూటౌన్): ఆసియాలోనే అతి పెద్దదైన ఏలూరు అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేయాలని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యే బడేటి చంటి, ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు ఆకాంక్షించారు. ఏలూరు మార్కెట్ యార్డులో నిర్వహించిన ఏఎంసీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఏఎంసీ చైర్మన్‌గా మామిళ్లపల్లి పార్థసారథి, వైస్ చైర్మన్‌గా నడపన వాణి సూర్యకుమారి, డైరెక్టర్లతో ఎమ్మెల్యే చంటి ప్రమాణ స్వీకారం చేయించారు. యార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని, హమాలీలకు మరుగుదొడ్ల నిర్మాణం, జింబో షెడ్ నిర్మాణానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అన్నిరంగాలూ అభివృద్ధి చెందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏఎంసీ చైర్మన్ పార్థసారథి మాట్లాడుతూ ఏఎంసీ చైర్మన్‌గా నియమించిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, ఎమ్మెల్యే చంటిలకు ధన్యవాదాలు తెలిపారు. ఈడా చైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, డిప్యూటీ మేయర్లు వందనాల దుర్గాభవాని, పప్పు ఉమామహేశ్వరరావు, కోఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్ఎంఆర్ పెదబాబు, జనసేన నాయకులు నగిరెడ్డి కాశీ నరేష్, నారా శేషు తదితరులు పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిపై అప్రమత్తత అవసరం

- వర్షాలు పడితే దోమల విజృంభణ
- ఏలూరు, వట్లూరు ప్రాంతాలు డెంగీ దోమలకు అవాసాలు



డెంగీ దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం (ఫైల్)

ఏలూరు టౌన్ : వర్షాకాలం సమీపిస్తోందంటే, డెంగీ దోమలు విజృంభిస్తాయి. ప్రాణాంతకమైన డెంగీ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవటంతోపాటు, మంచినీటి నిల్వలు లేకుండా నిత్యం జాగ్రత్తలు పాటించాలని వైద్య ఆరోగ్య శాఖ సూచిస్తోంది. పరిశీలించండి, పరిశుభ్రపరచండి, మూతలు పెట్టండి నినాదంతో ఈ ఏడాది వైద్య ఆరోగ్య శాఖ ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మాలిని, జిల్లా మలేరియా అధికారి పీఎస్ఎస్ ప్రసాద్, ఏలూరు మలేరియా అధికారి జే.గోవిందరావు ఆధ్వర్యంలో ప్రజలకు డెంగీ దోమల వ్యాప్తిని అరికట్టేందుకు అవగాహన కల్పిస్తున్నారు.

డెంగీ దోమలకు ఏలూరు అవాసం

ఏలూరు జిల్లాలోనే డెంగీ కేసులు అత్యధికంగా నమోదవుతున్న ప్రాంతాల్లో ఏలూరు నగరం, వట్లూరు ప్రాంతాలు ఉండడం గమనార్హం. వర్షాకాలం వస్తే చాలు నీటి నిల్వలు ఉండటంతో ఈ ప్రాంతాల్లో డెంగీ దోమలు విజృంభిస్తున్నాయి. ఏలూరు, వట్లూరుతోపాటు టి.నరసాపురం, లింగపాలెం, చింతలపూడి ప్రాంతాల్లోనే అత్యధికంగా 80 శాతం డెంగీ కేసులు నమోదయినట్టు వైద్యులు చెబుతున్నారు. అప్రమత్తంగా ఉండి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకుంటే డెంగీ ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

ఏడిస్ ఈజిప్ట్ దోమతో డెంగీ

ఏడిస్ ఈజిప్ట్ దోమలు కుట్టటంతో మనిషికి డెంగీ వైరస్ సోకుతుంది. ఆడ ఏడిస్ ఈజిప్ట్ దోమకాటు పట్ల ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. ఈ జాతి దోమ పైన నల్లని, తెల్లని చారలు ఉండడంతో ఈ దోమలను టైగర్ దోమలు అని కూడా పిలుస్తారు. ఈ దోమలు ఇంటిలోపల, ఆవరణలో ఉంటూ పగటి వేళల్లో మాత్రమే మనిషిని కాటు వేస్తాయి. అన్ని రకాల దోమల కంటే డెంగీ దోమ బరువుగా ఉండడంతో 400 మీటర్ల కంటే ఎక్కువ దూరం ఎగరలేని స్థితిలో ఉంటాయి. దోమలోనే కాకుండా దోమ గుడ్లలోనూ వైరస్ ఉంటుంది. ఈ డెంగీ దోమలు కేవలం మంచినీటి నిల్వలో మాత్రమే గుడ్లు పెడుతూ విస్తృంగా పెరుగుతాయి.

పరిశుభ్రత పాటించాలి

డెంగీ దోమలు విజృంభించకుండా ఇళ్లు, పరిసరాల్లోనూ పరిశుభ్రత పాటించాలి. మంచినీటి నిల్వలపై తప్పకుండా మూతలు పెట్టుకోవాలి. వారానికి ఒకసారి ఖచ్చితంగా డ్రై డేగా పాటిస్తూ నీటి తొట్టిలు వంటివి శుభ్రం చేసుకోవాలి. ఇంటి ఆవరణలో బంతి, పుదీనా మొదలైన మొక్కలు నాటటం వల్ల డెంగీ దోమలను నివారించే అవకాశం ఉంది. దోమలు కుట్టకుండా దోమతెరలు వినియోగించాలి. కొబ్బరి బొండాలు, టైర్లు, నీటి తొట్టెలు, పూలకుండీలు, ఎయిర్ కూలర్ల వెనుక శుభ్రం చేస్తూ ఉండాలి.

లక్షణాలు

- ఆకస్మికంగా తీవ్రమైన జ్వరం, తలనొప్పి, విపరీతమైన కండరాలు, కీళ్ల నొప్పులు.
- కళ్ల నొప్పులు, కంటి కదలిక తగ్గటం, నొప్పి ఉంటాయి.
- ఒక్కో సారి శరీరంలో ఎర్రటి దద్దుర్లు, చిగుళ్ల నుంచి రక్తస్రావం ఉంటాయి.
- అధికం దాహం, నోరు తడారిపోవటం వంటివి ఉంటాయి.
- డెంగీ వ్యాధి మూడు రకాలుగా ఉంటుంది. డెంగీ జ్వరం, డెంగీ హేమరేజ్ జ్వరం, డెంగీ పాక్సింద్రోమ్‌గా పేర్కొంటున్నారు.
- డెంగీ దోమకాటు అనంతరం 3 నుంచి 14 రోజుల్లో వ్యాధి లక్షణాలు బయటపడతాయి.
- డెంగీ సోకిన అనంతరం సాధారణంగా 80 శాతం మందికి దానంతట అదే తగ్గిపోతుంది.
- వ్యాధి తీవ్రతతో రక్తంలోని ప్లేట్‌లెట్స్ తగ్గిపోయి ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది.
- వ్యాధి తీవ్రతను తెలుసుకునేందుకు మాక్ ఎలీసా పరీక్షలు చేయించుకోవాలి.

ఏలూరు పరిసర ప్రాంతాల్లో నమోదైన డెంగీ కేసులు

సంవత్సరం	డెంగీ కేసులు		
		2022	137
		2023	97
2020	35	2024	69
2021	89	2025	3

డెంగీపై విస్తృత ప్రచారం



వర్షాలు పడుతూ ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఒకవైపు వాతావరణంలో మార్పులతో విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉండగా.. మరోవైపు నీటి నిల్వలు కారణంగా డెంగీ దోమలు విజృంభించే అవకాశం అధికంగా ఉంది. వారంలో ఒకరోజు డ్రై డేగా పాటించటం వల్ల దోమల ఉత్పత్తిని నిరోధించవచ్చు. ఎలాసా టెస్టును ఏలూరు జీజీహెచ్‌తోపాటు, ఏరియా హాస్పిటల్స్‌లోనూ చేస్తున్నారు. తీవ్రమైన జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవటంతోపాటు సరైన చికిత్స పొందాలి. ప్లేట్‌లెట్స్ పడిపోవటం వల్ల ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంది. ఏలూరు నగరంలో ప్రజలకు విస్తృంగా అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ మాలిని, ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

కేవీఎస్‌కు సత్కారం



కేవీఎస్‌ను సత్కరిస్తున్న స్థానిక ప్రముఖులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రముఖ నృత్య దర్శకుడు కళారత్న కేవీ సత్యనారాయణ ప్రసిద్ధ ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి ఆస్థాన విద్వాన్‌గా నియమించిన సందర్భంగా స్థానిక గానుగులపేటలోని ప్రముఖులు శనివారం ఆయన స్వగృహంలో కలిసి సత్కరించారు. పిల్లా హరినారాయణ, విశ్వ హిందూ పరిషత్, టు టౌన్ మహిళా ప్రముఖ్ పిల్లా దేవి, గానుగులపేట శ్రీ గౌరీదేవి ఆలయ సెక్రటరీ తంగేటి వీర మనోహర్, సువ్వాడ సత్యనారాయణ, 35వ డివిజన్ సభ్యులు, యువ నేతలు కేవీఎస్‌ను సత్కరించిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా హరినారాయణ మాట్లాడుతూ పలు చలన చిత్రాలకు నృత్య దర్శకత్వం వహించడంతో పాటు అనేక కూచిపూడి నృత్యరూపకాలకు రూపకల్పన చేసి దేశ విదేశాల్లో ప్రదర్శించడం ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలను దశదిశలా చాటుతున్న కేవీ సత్యనారాయన ఏలూరు వాసి కావడం స్థానికులకు గర్వకారణమన్నారు.

బైక్ చోరీ కేసులో ఏడాది జైలు

ఏలూరు(టూటౌన్): బైక్ దొంగతనం కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ ఏలూరు స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎక్సైజ్ కోర్టు జడ్జి కె.స్పందన శనివారం తీర్పు వెలువరించారు. గణపవరం మండలం ముగ్గళ్ల గ్రామానికి చెందిన చప్పిడి ముసలయ్యపై గతంలో బైక్ చోరీ కేసు నమోదైంది.

అలరించిన నాటికలు



అనస్వరం నాటికలో ఆకట్టుకున్న సన్నివేశం



విడాకులు కావాలి నాటికలోని కీలక సన్నివేశం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సమాజ పోకడలనే కథాంశాలుగా చేసుకుని ప్రదర్శించిన నాటికలు ప్రేక్షకులను విశేషంగా అలరించాయి. విజయవాడ శ్రీ కృష్ణ తెలుగు థియేటర్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో సైకో థెరపీ ద్వారా మానసిక బలహీనులను మార్చే ఒక సైకాలజిస్ట్ పిచ్చివాడుగా మారే పరిస్థితులను కళ్లకు కట్టినట్టు చూపిన అనస్వరం నాటిక ఆలోచనాత్మకంగా ఆకట్టుకుంది. తాడేపల్లి, కుంచనపల్లికి చెందిన అరవింద ఆర్ట్స్ సంస్థ కళాకారులు ప్రదర్శించిన విడాకులు కావాలి నాటిక భారతీయ వివాహ బంధం ఔన్నత్యాన్ని చాటుతూ కొనసాగింది. తొలుత అంబికా సంస్థల వ్యవస్థాపకులు ఆలపాటి రామచంద్రరావు శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని అంబికా సంస్థలు, హిందూ యువజన సంఘం హేలాపురి కళా పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 17, 18, 19, 20 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి నాటిక పోటీలు శనివారం సాయంత్రం స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో ఘనంగా ప్రారంభమయ్యాయి. అంబికా సంస్థల చైర్మన్ అంబికా కృష్ణ అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బడేటి చంటి, జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్, తదితరులు పాల్గొని కళా సాంస్కృతిక రంగాల్లో నగరానికి ఉన్న కీర్తి ప్రతిష్ఠలను కొనసాగిస్తూ జాతీయ స్థాయిలో నాటిక పోటీలు నిర్వహించడం అబినందనీయమన్నారు. ఏలూరు నగర కీర్తిని ప్రపంచ వ్యాప్తం చేసిన ఆలపాటి రామచంద్రరావు కుమారులు అంబికా కృష్ణ, అంబికా ప్రసాద్, అంబికా రాజా వివిధ రంగాలలో చేసిన, చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో హిందూ యువజన సంఘం మనేజ్మెంట్ కమిటీ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు, సెక్రటరీ కళారత్న కేవీ సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ కమిటీ అధ్యక్షులు ఇరదల ముద్దుకృష్ణ, సెక్రటరీ మజ్జి కాంతారావు, వేణు గోపాల్ లునాని, వేమా కోటేశ్వరరావు, ఆర్ఎస్ఆర్ నాగేశ్వర రావు, ఎల్. వెంకటేశ్వరరావు, కేబీ రావు, కానాల రమేష్, జీ. శ్రీనివాసరావు, జీ. లలితాశర్మ, లంకా వెంకటేశ్వర్లు, మారం హనుమంతరావు, కానాల మురళీకృష్ణ, అంబికా కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. హేలాపురి కళాపరిషత్ నిర్వాహకులు సంకు సురేష్, పెదపాటి రామకృష్ణ, మహమ్మద్ ఖాజా వలి నాటిక ప్రదర్శనలు పర్యవేక్షించారు.

వేధిస్తున్నారంటూ యువతి ఆత్మహత్యాయత్నం



ఏలూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న నిహారిక

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్‌కు చెందిన ఒక యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తాము అద్దెకు ఉంటోన్న ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయంటూ యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారంతా తమను మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారంటూ సూసైడ్‌నోట్ రాసిమరీ ఆమె శుక్రవారం ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. ఆమెకు కుటుంబ సభ్యులు ఏలూరు జీజీహెచ్‌కు తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు.

సూసైడ్ నోట్, ఎమ్మెల్సీ ఆధారంగా.. దక్షిణపువీధి అశోక్‌చక్రం సమీపంలోని ఒక ఇంట్లో హెడ్ కానిస్టేబుల్ కుటుంబం గత కొన్నేళ్లుగా నివాసం ఉంటోంది. ఇటీవల హెడ్‌కానిస్టేబుల్ అనారోగ్యంతో మృతిచెందగా... అతని భార్య, ముగ్గురు కుమార్తెలు నివాసం ఉంటున్నారు. గత ఏడాదిలో ఇంటి యజమాని కోయ శ్రీనివాసరావు బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలోనూ మరోసారి బంగారు నగలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ చోరీలపై యజమాని శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు పట్టించుకోకపోవడంతో ఇటీవల ఎస్పీ శివకిషోర్‌కు వినతి పత్రం అందివ్వగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో హెడ్‌కానిస్టేబుల్ రెండో కుమార్తె నిహారిక స్నేహితులైన ఇద్దరు యువకులను పోలీసులు విచారణ పేరుతో పోలీస్‌స్టేషన్‌కు పిలిచి స్టేట్‌మెంట్ రికార్డ్ చేసుకున్నారు. ఇదే ప్రాంతంలోని సుంకర మౌనిక అనే వ్యక్తి ఇంట్లోనూ ఇటీవల చోరీ జరగటంతో తమపై వేధింపులకు పాల్పడుతున్నారంటూ బాధిత యువతి పేర్కొంది. ఇంటి యజమాని కోయా శ్రీనివాసరావు, అతని సోదరుడు కోయ సత్తిబాబు, అశోక్ అనే వ్యక్తి, ఒక టీవీ చానల్‌కు చెందిన రిపోర్టర్ వేధిస్తున్నారంటూ బాధితురాలు నిహారిక ఫిర్యాదులో పేర్కొంది. తమకు న్యాయం చేయాలని పోలీసులను కోరుతుంది.

వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన కోయ సత్తిబాబు మాట్లాడుతూ 'నా సోదరుడు కోయ శ్రీనివాసరావు ఇంట్లో ఈ ఏడాది ఫిబ్రవరిలో 32.4 కాసులకు పైగా బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయి. ఇంట్లో చోరీపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. ఎస్పీ కేపీ శివకిషోర్‌కు మా సమస్యపై వినతిపత్రం అందజేసి మా బాధను తెలియజేశాం. ఈ నెల 7న మళ్లీ ఏలూరు వన్‌టౌన్ పోలీసులు ఫిర్యాదు ఇవ్వాలని చెప్పటంతో మా సోదరుడు శ్రీనివాసరావు ఇంట్లో బంగారు ఆభరణాలు అపహరణకు గురయినట్లు రాసి ఇచ్చాం. మేము పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో బంగారం చోరీకి గురైందని మాత్రమే పేర్కొన్నామని, ఎవరిపైనా అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో చెప్పలేదని స్పష్టం చేశారు. మాపై కావాలనే అసత్య ప్రచారం చేస్తూ కేసును తప్పుదారి పట్టించేలా ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పోలీసు అధికారులు విచారణకు ఎవరిని తీసుకెళ్లారో మాకు తెలియదు. తాము ఎవరినీ వేధింపులకు గురిచేయలేదు. ఈ కేసుపై ఎస్పీ, పోలీసులు సమగ్రమైన విచారణ చేపట్టి నిందితులను శిక్షించేలా చర్యలు తీసుకోవాలి' అని కోరారు.



కోయ సత్తిబాబు, ఏలూరు

క్రమశిక్షణతోనే ఉన్నత స్థానాలు



యోగ సాధన చేస్తున్న విద్యార్థులు



విద్యార్థులకు నీతికథలు చెబుతున్న వాసుకి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థులు చిన్నతనం నుంచి క్రమశిక్షణతో మెలుగుతూ పెద్దల పట్ల గౌరవ మర్యాదలు, వినయ విధేయతలు చూపుతూ పెరిగిన నాడే వారు జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుంటారని రీసోర్స్‌పర్సన్ జి. జయలక్ష్మి సూచించారు. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం ఉదయం నుంచి గ్రంథాలయ సిబ్బంది విద్యార్థుల చే పుస్తక పఠనంలోని సింహం – కుందేలు నీతికథలను బోధిస్తూ కథా సారాంశాన్ని వివరించారు. యోగ క్లాసులు నిర్వహించారు. ప్రతి పనిలో సమయపాలన, క్రమశిక్షణ ఎంతో అవసరమని, తల్లిదండ్రులే మనకు మొట్టమొదటి నేస్తాలు, మన రాష్ట్రాలు – మన దేశ రాజధానులుపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చిన్నారులకు వివరించారు. పర్యావరణ – పరిరక్షణపై అవగాహన కల్పించారు. రిసోర్స్ పర్సన్ కె.తరుణ్ విద్యార్థులతో సరదా ఫన్నీ గేమ్స్ ఆడించారు. ఈ శిక్షణ తరగతులను డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు పర్యవేక్షించారు. అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్ కుమార్, ఎండీ అస్లాంపాషా, బీవీఎస్. లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

వినటం చెప్పటం అత్యంత ప్రాధాన్యం

దెందులూరు: విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచి వినటం చెప్పటం అత్యంత ప్రాధాన్యత అంశాలని ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రంథాలయ అధికారిని వాసుకి అన్నారు. శనివారం చాటపర్రు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా నీతి కథలు, స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రను ఉపాధ్యాయులతో చెప్పించారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర



పారిశుద్ధ్య కార్మికులను సన్మానించిన దృశ్యం

ఏలూరు(మెట్రో): ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ శాఖలు, సంస్థల ఆధ్వర్యంలో మూడో శనివారం సందర్భంగా స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో చేపట్టారు. ఈ నెలలో అంశంగా ఉష్ణతాపం నుంచి ఉపశమనం (బీట్ ద హీట్) కార్యక్రమాన్ని ప్రభుత్వ కార్యాలయాల ఆధ్వర్యంలో ఉష్ణతాపం నుంచి వడగాల్పుల నుంచి ఉపశమనం కల్పించే చర్యలు చేపట్టారు. కలెక్టరు కె.వెట్రిసెల్వి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నెలరోజుల పాటు చేపట్టేందుకు శనివారం నుంచి కార్యాచరణకు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ కార్యాలయాల్లో తాగునీరు ఏర్పాటు చేశారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది శ్రమదానంగా శుభ్రపరిచే కార్యక్రమంలో పాల్గొన్నారు. పలుచోట్ల ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో పవర్ పేటలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. కైకలూరు సీహెచ్‌సీలో డీసీహెచ్ఎస్ డాక్టరు పాల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు, పత్తేబాద రైతు బజారు వద్ద ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు, ఎస్సీ కార్పొరేషన్ ఎం ముక్కంటి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రాలు, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు ఆధ్వర్యంలో పక్షులకు మంచినీటి సౌకర్యం కల్పించారు.

15 గ్రామాల్లో కార్యక్రమాలు

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం మల్కాపురం సహా 15 గ్రామాల్లో శనివారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు నిర్వహించినట్టు ఎంపీడీఓ సుజాత తెలిపారు. గ్రామ సర్పంచ్ సునీత, గ్రామ కార్యదర్శి జగదీష్ చంద్ర ప్రసాద్, నాయకులు కలిసి చలివేంద్రాలు సీనియర్ సిటిజన్లు, పిల్లలు బహిరంగ కార్మికుల కోసం ఆరోగ్య శిబిరాలు, పక్షులు జంతువులకు నీటి తొట్టిల ఏర్పాటు బహిరంగ ప్రదేశాల్లో షేడ్ నెట్లు ఏర్పాటుచేశామన్నారు. గ్రామానికి విశిష్ట సేవలందిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు ఏడుగుర్ని శాలువా, పూలదండలు, బొకేలతో సత్కరించారు.

నకిలీ అధికారుల ఆగడాలను అరికట్టాలి

ఏలూరు (టూటౌన్): కార్మిక శాఖ నకిలీ అధికారుల ఆగడాలను అరికట్టాలని సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్ఆర్‌పేట స్ఫూర్తి భవన్‌లో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఏలూరు నగరంలోని చిన్న, చిన్న వ్యాపారులు, స్వయం ఉపాధి పొందుతున్న వారిపై కార్మిక శాఖ అధికారులు అంటూ లేబర్ లైసెన్సులు రెన్యువల్ చేయించుకోవాలని, లేబర్ సర్టిఫికెట్లు, ట్రేడ్ లైసెన్సులు, టెక్నికల్ సర్టిఫికెట్లు తీసుకోవాలని ఫోన్లు చేసి నకిలీ కార్మిక శాఖ అధికారులు చిన్న,చిన్న వ్యాపారులపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ నెల 15న రాత్రి 8 గంటలకు నకిలీ లేబర్ ఇన్‌స్పెక్టర్ రాణా చౌదరి స్వయంగా తనకే ఫోన్ చేసిన కార్మిక శాఖ మంజూరు చేసే లేబర్ లైసెన్సులను తక్షణమే రెన్యువల్ చేయాలని లేకపోతే షోకాజ్ నోటీసులు ఇచ్చి వ్యాపారాలను మూయించేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపారు. 16న శుక్రవారం ఉదయం 11 గంటలకు కార్మిక శాఖ కార్యాలయానికి వెళ్లి సమస్యను వివరించగా, సమాచారం కావాల్సి వస్తే ఫోన్‌లో కాకుండా తమ కార్యాలయానికి పిలిపించి తెలుసుకుంటామని చెప్పి, ఇటువంటి నకిలీ ఫోన్ కాల్స్ నకిలీ అధికారుల నుంచి వచ్చే మెసేజ్‌లకు స్పందించవద్దని ఉచిత సలహా ఇచ్చి పంపించేశారని వివరించారు. సమావేశంలో సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యవర్గ సభ్యులు మావూరి విజయ,బళ్ళ కనకదుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

విజయ్ షాను తొలగించండి

ఏలూరు (టూటౌన్): కల్నల్ సోఫియా ఖురేషి పై వ్యాఖ్యలు చేసిన విజయ్ షాను క్యాబినెట్ నుంచి తక్షణం తొలగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి భారత సైన్యం గౌరవం, గుర్తింపు ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షా కల్నల్ సోఫియా ఖురేషిపై చేసిన వ్యాఖ్యల పట్ల బీజేపీ మౌనంగా ఉండటం సరికాదని పేర్కొన్నారు.

రైల్వే స్టేషన్ వద్ద చలివేంద్రం ప్రారంభం



రైల్వేస్టేషన్ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభించిన అధికారులు

ఏలూరు టౌన్: వేసవి కాలంలో ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాన్ని ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె.నాగప్రభుకుమార్ తెలిపారు. కలెక్టర్ వెట్రిసెల్వి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత ఆదేశాల మేరకు ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్ వద్ద చలివేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. రైల్వే ప్రయాణికులు, ప్రజలు, కార్మికులు, పాదచారులకు తాగునీటిని అందించేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ అజయ్‌కుమార్ సింగ్, సీఐ భోగేశ్వరరావు, సీఐ కృష్ణధనరాజ్, సిబ్బంది ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఏలూరు(మెట్రో): వేసవికాలం తీవ్ర ఎండల దృష్ట్యా ఏలూరు జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ జి.పద్మశ్రీ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కె.భీమేశ్వర్, జిల్లా పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.